TEL : T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

సంపుటి : 01 సంచిక : 218 | సోమవారం 14-04-2025 | పబ్లిషర్ హైదరాబాద్ | పేజీలు 5 | వెల-5

# 'భూభారతి' కనీసం వందేళ్ళ ఉంటుంది: సీఎం రేవంత్


వందేళ్ల పాటు వినియోగించుకునేందుకు వీలుగా భూభారతి వెబ్‌సైట్ ఉండాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

హైదరాబాద్: వందేళ్ల పాటు వినియోగించుకునేందుకు వీలుగా భూభారతి వెబ్‌సైట్ ఉండాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో భూభారతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాన్య రైతులకు సైతం అర్థమయ్యేలా భూభారతి వెబ్‌సైట్ ఉండాలన్నారు. అత్యాధునికంగా రూపొందించాలని కోరారు. భద్రతాపరమైన సమస్యలు రాకుండా పకడ్బందీగా ఫైర్‌వాల్ ఉండాలన్న సీఎం.. భూభారతి నిర్వహణ బాధ్యతను విశ్వసనీయ సంస్థకు అప్పగిస్తే బాగుంటుందని తెలిపారు. భూభారతి పోర్టల్‌ను సోమవారం జాతికి అంకితం చేయనున్నట్లు తెలిపారు.

ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, రెవెన్యూ శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాశ్ సీసీఎల్ఏ కార్యదర్శి మకరంద్ సహా పలువురు ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

జూన్ 2 నాటికి భూభారతి అమలు: మంత్రి పొంగులేటి
ముందుగా మూడు మండలాల్లో పైలట్‌గా భూభారతి అమలు చేయనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. జూన్ 2 నాటికి రాష్ట్రవ్యాప్తంగా భూభారతి అమలు చేస్తామని తెలిపారు. శాసనసభ ఎన్నికలకు ఇది రెఫరండం అవుతుందన్నారు. మే మొదటి వారంలో గ్రామపాలనాధికారులను నియమిస్తామని చెప్పారు.

- భూభారతి వెబ్‌సైట్‌ను వందేళ్ల పాటు వినియోగించుకునేలా అత్యాధునికంగా తీర్చిదిద్దాలని ఆదేశం.
- రైతులకు సైతం అర్థమయ్యేలా సులభంగా ఉండే ఇంటర్‌ఫేస్ డిజైన్ చేయాలని సూచన.
- భద్రతా పరిరక్షణకు శక్తివంతమైన ఫైర్‌వాల్, సురక్షిత డేటా వ్యవస్థ అవసరం అని సూచన.
- వెబ్‌సైట్ నిర్వహణ బాధ్యతను విశ్వసనీయ సంస్థకు అప్పగించాలన్న సూచన.
- భూభారతి పోర్టల్‌ను సోమవారం జాతికి అంకితం చేయనున్నట్టు సీఎం వెల్లడించారు.



## మార్క్ శంకర్‌తో కలిసి హైదరాబాద్ చేరుకున్న పవన్‌కల్యాణ్

ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తన కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్ చేరుకున్నారు.



2లో

## టీజీపీఎస్సీకి క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదు: రాకేష్‌రెడ్డి

పూర్తి ఆధారాలతో గ్రూప్-1 అవకతవకలు బయటపెట్టామని, టీజీపీఎస్సీకి క్షమాపణ చెప్పే ప్రసక్తేలేదని భారాస నేత రాకేష్ రెడ్డి అన్నారు.



2లో

## కాలయాపన ఇంకెన్నాళ్లు?..

టన్నెల్‌లో చిక్కుకున్న ఆరుగురి పరిస్థితేంటి?: హరీశ్‌రావు



2లో

- ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల 8 కుటుంబాల్లో విషాదం నెలకొన్నదని ఆరోపణ.
- కుటుంబ సభ్యుల ఆవేదన అరణ్య రోదనగా మారిందని వ్యాఖ్య.
- సహాయక చర్యల సమన్వయంలో విఫలం, తీవ్రంగా ఆలస్యం, దిశా నిర్దేశం లేని చర్యలు కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు ఉదాహరణగా పేర్కొన్నారు.

## బిల్డర్ల సమస్యలు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నాం

నిర్మాణ రంగం అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు.





హైదరాబాద్: నిర్మాణ రంగం అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. బిల్డర్ల సమస్యలు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఆదివారం నిర్వహించిన 'సైబరాబాద్ బిల్డర్స్ అసోసియేషన్' వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి ఉత్తమ్ హాజరయ్యారు.

2లో

## ఆర్టీసీ బస్సు కింద పడి వ్యక్తి మృతి.. ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యం వల్లేనంటూ వాహనదారుల ఆందోళన



2లో

## రేవంత్ లాంటి మోసగాడిని నమ్మినందుకు తెలంగాణ ఆగమైంది : కేటీఆర్



2లో

మేడ్చల్ మల్కాజ్‌గిరి : తెలంగాణ ప్రజలు రేవంత్ రెడ్డి లాంటి మోసపూరిత నేతను నమ్మిన ఫలితంగా తీవ్రంగా మోసపోయారని, రాష్ట్రానికి చివరికి చేతిలో మిగిలింది చిప్పే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మల్కాజిగిరిలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

## రెండురోజులు ఈ జిల్లాల్లో ఈదురుగాలులతో వర్షాలు.. ఎల్లో అలెర్ట్ జారీ చేసిన ఐఎండీ..



2లో

## భారత్‌కు చిక్కకుండా తప్పించుకునేందుకు తహవ్వుర్ రాణా 33 సాకులు..!

- భారత్ చేతికి దొరక్కుండా ఉగ్రవాది తహవ్వుర్ రాణా విశ్వప్రయత్నాలు చేశాడు
- తన శరీరం జబ్బుల మయం అయినట్లు అమెరికా ప్రభుత్వాన్ని నమ్మించే యత్నం చేశాడు
- కానీ, ట్రంప్ సర్కారు ఇవేవీ పట్టించుకోలేదు.




మిగతాది 2లో

# సంపాదకీయం

## తిరోగమనంలో రాహుల్‌గాంధీ?

అఖిల భారత కాంగ్రెస్ పార్టీకి ఏమైంది? జన్యుపరమైన లోపాలేవో ఆ పార్టీని పట్టిపీడిస్తున్నాయి. స్వాతంత్ర్య సముపార్జనలో అగ్ర భాగాన ఉండి, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సుదీర్ఘ కాలం అధికారంలో కొనసాగిన ఆ పార్టీ నాయకత్వం ఇప్పుడు వెలవెలబోవడానికి కారణమేమిటి? కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కాంగ్రెస్ పార్టీ జవసత్వాలు కోల్పోవడానికి ఆ పార్టీ నాయకత్వం అనుసరిస్తున్న విధానాలే కారణమా? ఈ తరం ఆశిస్తున్నది ఏమిటో గుర్తించి అందుకు అనుగుణంగా పార్టీని తీర్చిదిద్దడంలో, విధానాల రూపకల్పనలో కాంగ్రెస్ నాయకత్వం విఫలమవుతోందా? ప్రపంచీకరణ వైపు ప్రజలు చూస్తున్న ఈ రోజుల్లో కమ్యూనిస్టుల భావజాలాన్ని అందిపుచ్చుకోవడమే ఆ పార్టీకి శాపంగా మారిందా? వరుస ఓటములతో పార్టీ భవిష్యత్తు మసకబారిన సమయంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసేందుకు గుజరాత్‌లో ఇటీవల నిర్వహించిన సదస్సులో కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ చేసిన ప్రసంగం విన్నవారికి ఆ పార్టీకి భవిష్యత్తు ఉంటుందన్న నమ్మకం కలగడం లేదు. 75 ఏళ్లకు చేరువలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పోటీపడటంలో 50 ఏళ్లు పైబడిన రాహుల్‌గాంధీ ఎందుకు వెనుకబడుతున్నారు? అని ప్రశ్నించుకుంటే, ప్రజలు ఏమి కోరుకుంటున్నారు? వారి ఆలోచనలలో వచ్చిన మార్పు ఏమిటి అన్నది పసిగట్టకపోవడమే కారణంగా కనిపిస్తోంది.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో బలంగా ఉండిన కమ్యూనిస్టు పార్టీలు క్రమంగా బలహీనపడిపోవడానికి కారణమేమిటి? ప్రజల ఆలోచనల్లో వస్తున్న మార్పును గుర్తించడానికి నిరాకరిస్తూ తుప్పు పట్టిన భావజాలాన్నే కొనసాగించడం వల్లనే కమ్యూనిస్టు పార్టీలు దెబ్బతింటున్నాయన్న విషయం కమ్యూనిస్టులకు తప్ప అందరికీ అర్థమవుతోంది. సాయుధ పోరాటమే మార్గమని నమ్మిన మావోయిస్టులనే తీసుకుందాం! ఒకప్పుడు దోపిడీకి గురైన ప్రజలు మావోయిస్టులను ఆశ్రయించి, ఆదరించేవారు. ఇప్పుడు సమాజంలో శ్రమ దోపిడీ అనే మాట పెద్దగా వినపడటం లేదు. ఫలితంగా మావోయిస్టుల అవసరం జనానికి లేకుండా పోయింది. ప్రపంచీకరణ కారణంగా కష్టపడే వారికి ఉపాధి అవకాశాలకు కొదవ ఉండటం లేదు. జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడ్డాయి. ఫలితంగా మావోయిస్టులు బలహీనపడుతున్నారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన యుద్ధంతో ఉక్కిరిబిక్కిరి అవుతూ శాంతి చర్చల మంత్రం జపిస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మావోయిస్టులు చరిత్ర పుటలకే పరిమితం అవుతారు. కమ్యూనిస్టుల పరిస్థితి కూడా ఇంచుమించుగా ఇలాగే ఉంది. దళిత, మైనారిటీ సంక్షేమం కోసం పోరాడటమే తమ లక్ష్యంగా భావించిన కమ్యూనిస్టులు కాలక్రమంలో మెజారిటీ ప్రజలకు దూరమయ్యారు. యువతరానికి పూర్తిగా దూరమయ్యారు. సమస్యలు ఎదురైనప్పుడు కమ్యూనిస్టులను ఆశ్రయించిన దళిత, మైనారిటీలు ఎన్నికల సమయంలో మాత్రం వారికి ముఖం చాటేసేవారు. 'బూర్జువా' పార్టీలకే ఓటు వేసేవారు. ఈ పరిణామాన్ని గుర్తించి, తమ విధానాలను సంస్కరించుకోవడానికి నిరాకరించిన కమ్యూనిస్టులు ఇప్పుడు ఇలా మిగిలారు. విచిత్రంగా ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కూడా కమ్యూనిస్టులు వాడిన పడికట్టు పదాలనే వాడుతోంది. ప్రజలకు దూరమైన కమ్యూనిస్టులను అనుకరించాలని అనుకోవడమే ఆ పార్టీ భావదారిద్ర్యంగా కనిపిస్తోంది.

### కాంగ్రెస్... నాడు, నేడు

దేశానికి స్వాతంత్ర్యం రాకముందు, వచ్చిన తర్వాత కాంగ్రెస్ నాయకత్వం అనుసరించిన విధానాలు ఏమిటి? ఇప్పుడు ఆ పార్టీ యువ నాయకత్వం అనుసరిస్తున్న విధానాలు ఏమిటి? అని ప్రశ్నించుకుంటే పొంతనే ఉండటం లేదు. తొలి తరం కాంగ్రెస్ నాయకత్వం అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వ రంగాన్ని ప్రోత్సహించింది. ఆ తర్వాత దశలో ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రైవేటీకరణను ప్రోత్సహించారు. ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే పేదల సంక్షేమం చేపట్టవచ్చని నమ్మారు. అయితే, కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ ముస్లిం మైనారిటీలను సంతృప్తిపరచడానికే ప్రాధాన్యం ఇచ్చేదన్న అభిప్రాయం ఉండేది. ఈ కారణంగా మెజారిటీ ప్రజలు క్రమంగా ఆ పార్టీకి దూరమవుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ గుజరాత్ సదస్సులో మాట్లాడుతూ... సమాజంలో బడుగు బలహీనవర్గాలను కలుపుకొంటే దళిత, మైనారిటీల జనాభా 90 శాతం ఉండగా, దేశ సంపదలో 90 శాతం మాత్రం పది శాతం ఉన్న కార్పొరేట్ శక్తుల చేతిలో ఉందని విమర్శించారు. సుదీర్ఘకాలం అధికారంలో కొనసాగి, మళ్లీ అధికారంలోకి రావాలనుకుంటున్న పార్టీ నాయకుడి నోట ఇటువంటి మాటలు రావడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఒకప్పుడు కమ్యూనిస్టులు ఇటువంటి వ్యాఖ్యలు చేసేవారు. ముత్తాత జవహర్‌లాల్ నెహ్రూ, నాయనమ్మ ఇందిరాగాంధీ అనుసరించిన విధానాలను కూడా రాహుల్‌గాంధీ అధ్యయనం చేయకపోవడం ఆశ్చర్యంగా ఉంది. దళిత, మైనారిటీలతోపాటు బడుగు, బలహీనవర్గాల వారి అభ్యున్నతిని కాంక్షించని వారు ఉండరు. అలాగే ఆ వర్గాలవారు రాజకీయంగానూ ఎదగాలని ఏ పార్టీ అయినా కోరుకుంటుంది. ప్రధానమంత్రి మోదీ స్వయంగా తాను బీసీని అని చెప్పుకోవడం దేనికి సంకేతం? కాంగ్రెస్‌లో ఒకప్పుడు బ్రాహ్మణులు అధికంగా కనిపించేవారు. ఉత్తరాది రాష్ట్రాలలో బ్రాహ్మణ నాయకత్వమే ఉండేది. కాలక్రమంలో బ్రాహ్మణులు కనుమరుగై ఇతర అగ్రవర్ణాలవారు నాయకత్వం వహించే స్థితికి ఎదిగారు. ఇప్పుడు క్రమంగా బడుగు బలహీనవర్గాలవారు నాయకత్వ స్థానాలను అందుకుంటున్నారు. ఇదొక సహజ ప్రక్రియ. బ్రాహ్మణ ఆధిపత్యం పోవడానికి ఎవరూ కారణం కాదు. అలాగే బడుగు బలహీనవర్గాల వారు నాయకత్వ స్థానాల్లోకి రావడానికి కూడా ప్రత్యేకంగా ఎవరూ కారణం కాదు. సమాజంలో చోటుచేసుకుంటున్న మార్పులే ఇందుకు కారణం. గ్రామాలలో భూమి ఎవరి ఆధీనంలో ఉంటే వారికే రాజకీయ అధికారం లభించడం సహజమని అంటారు. ఒకప్పుడు భూమి బ్రాహ్మణుల వద్ద ఉండేది. వారు పట్టణాలకు వలస వెళ్లిన తర్వాత ఇతర అగ్రవర్ణాల చేతుల్లోకి భూమి వెళ్లింది. దీంతో రాజ్యాధికారం వారికి దక్కింది. ఇప్పుడు క్రమంగా భూమి బలహీనవర్గాలు, దళితుల చేతుల్లోకి వెళుతోంది. ఈ క్రమంలో అతి త్వరలోనే రాజ్యాధికారం బలహీనవర్గాలు, దళితులకు అందబోతోందని అనుకోవాలి. ఈ పరిణామం పరిపక్వం చెందక ముందే సామాజిక న్యాయం పేరిట కొన్ని పార్టీలు రాజకీయ విన్యాసాలు చేసి విఫలమయ్యాయి. తెలుగు రాష్ట్రాలలో ఇది చూశాం. సామాజిక న్యాయం పేరిట బీసీలకు, దళితులకు ఎన్నికల్లో టికెట్లు ఇచ్చినంత మాత్రాన విజయం వరించదు. 2014 ఎన్నికల్లో తెలంగాణలో తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలనుకున్న తెలుగుదేశం పార్టీ బీసీ నినాదాన్ని అందిపుచ్చుకుంది. బీసీ సంఘాల నాయకుడు ఆర్.కృష్ణయ్యను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించింది. అయినా అగ్రవర్ణానికి చెందిన కేసీఆరే అధికారంలోకి వచ్చారు. ఏడాదిన్నర క్రితం జరిగిన ఎన్నికల్లో కూడా ముఖ్యమంత్రి పదవి కోసం కేసీఆర్%-%రేవంత్‌రెడ్డి మధ్యనే పోటీ జరిగింది. ఎన్నికల్లో నిజానికి ఫలానా ఫార్ములానే పని చేస్తుందని చెప్పలేం. ఎన్నికల సమయానికి ఉన్న పరిస్థితులను బట్టి ప్రజలు ఓటేస్తారు. ఉత్తరాదిలో ఉన్నంతగా దక్షిణాదిలో కులాల ప్రాబల్యం కనిపించదు. సామాజిక న్యాయంతో పాటు పేదలు%-%పెత్తందారుల మధ్య యుద్ధం అని ప్రకటించిన జగన్మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో ఘోరంగా ఓడిపోయారు కదా?

భారత్‌కు చిక్కకుండా తప్పించుకునేందుకు

## తహవ్వుర్ రాణా 33 సాకులు..!

మొదటిపేజీ తరువాయి

తనను భారత్‌కు అప్పగించకుండా అమెరికా ప్రభుత్వానికి తహవ్వుర్ రాణా చాలా కుంటిసాకులు చెప్పాడు. చట్టపరమైన మార్గంలో ఎన్ని అవకాశాలున్నాయో అన్నింటినీ వాడుకొనేందుకు తీవ్రంగా యత్నించాడు. కానీ, ట్రంప్ సర్కారు అవేవీ పట్టించుకోకుండా అతడిని భారత్‌కు అప్పగించింది. ఈ ఏడాది జనవరి 21న అతడి న్యాయవాది జాన్ డి క్లైన్ అమెరికా విదేశాంగశాఖకు ఓ లేఖరాశాడు. భారత్‌లో తహవ్వుర్ రాణాను చిత్రహింసలు పెడతారని.. అతడికి 30 రకాల ఆరోగ్య సమస్యలున్నాయని పేర్కొన్నాడు. ఇండియా జైళ్లలోనే అతడు చనిపోయే అవకాశం ఉందని వెల్లడించాడు.

"మరణశిక్షను ఎదుర్కోవడం కోసం భారత్‌కు అప్పగిస్తే షాకింగ్ పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అతడు తీవ్రమైన టార్చర్‌ను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఓ పాకిస్థానీ కావడమే అందుకు కారణం. దీనికి తోడు భారత చరిత్రలోనే అత్యంత దారుణమైన ఉగ్రదాడితో అతడి పేరును ముడిపెట్టడం కూడా ఒకటి. కొన్నేళ్లుగా రాణా ఆరోగ్యం క్షీణిస్తోంది. గత ఐదేళ్ల నుంచి పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. లాస్ ఏంజెలెస్‌లోని మెట్రోపాలిటిన్ కారాగారంలో ఉన్నాడు. అతడికి పార్కిన్సన్ వ్యాధి ఉన్నట్లు 2024లో గుర్తించారు. ఇక జ్ఞాపకశక్తికి సంబంధించిన సమస్యలతో కూడా బాధపడుతున్నాడు. మూత్ర సంబంధ సమస్యలున్నాయి. అతడి బ్లాడర్‌లో పెరుగుతున్న కండరం క్యాన్సర్ అనే అనుమానం ఉంది" అని పేర్కొన్నాడు. వీటితోపాటు కిడ్నీ సమస్యలు, టీబీ, సైనస్, బ్రాంకోటైటిస్, ఆస్థమా, థైరాయిడ్ సమస్యలు, వినికిడి సమస్యలు ఇలా పలు రకాలు ఉన్నట్లు చెప్పాడు. దీంతోపాటు భారత జైళ్లలో పరిస్థితి అత్యంత ఘోరంగా ఉంటుందని పేర్కొన్నాడు. రాణా మొత్తం 33 ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నట్లు వెల్లడించాడు.

### అమెరికా విదేశాంగశాఖ ఏమందంటే..?

రాణా లాయర్ లేఖకు అమెరికా విదేశాంగశాఖ నాడు స్పందించింది. అతడిని కచ్చితంగా భారత్‌కు అప్పగిస్తామని దానిలో తేల్చిచెప్పింది. రాణా లాయర్ లేఖను విదేశాంగ మంత్రి మార్కో రూబియో కార్యాలయం కొట్టిపారేసింది. భారత్ అంతర్జాతీయ చట్టాలను పాటిస్తుందని, జైళ్లలో చిత్ర హింసల నిరోధానికి ఐరాస చట్టంపై సంతకం చేసిందని వెల్లడించింది. వారెంట్ ప్రకారం రాణాను ఎప్పుడైనా భారత్‌కు అప్పగించవచ్చని.. అతడికి సంబంధించిన వైద్యసమాచారం వేగంగా అందించాలని సూచించింది.

గత వారం రాణాను జాతీయ దర్యాప్తు సంస్థ బృందం భారత్‌కు తీసుకొచ్చింది. అతడిని 18 రోజుల కస్టడీకి అప్పజెపుతూ న్యాయస్థానం తీర్పును ఇచ్చింది. దీంతో ఎన్ఐఏ అతడిని విచారించడం మొదలుపెట్టింది. ముంబయి దాడులకు సూత్రధారులను గుర్తించే పనిని మొదలుపెట్టింది. ముఖ్యంగా ఈ దాడుల్లో ఇలియాస్ కశ్మీరీ, అబ్దుర్ రెహ్మాన్, జకీయూర్ రెహ్మాన్ లఖ్వీ పాత్రలపై సమాచారం సేకరించనున్నారు.

## కాలయాపన ఇంకెన్నాళ్లు?..

### టన్నెల్‌లో చిక్కుకున్న ఆరుగురి పరిస్థితేంటి?: హరీశ్‌రావు

మొదటిపేజీ తరువాయి

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ సహాయక చర్యల్లో పురోగతి లేదని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు.

హైదరాబాద్: ఎస్ఎల్‌బీసీ టన్నెల్ సహాయక చర్యల్లో పురోగతి లేదని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఈమేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. ప్రమాదం జరిగి 50 రోజులైనా ప్రభుత్వ నిర్లక్ష్యం బాధాకరమని.. టన్నెల్ వద్ద కుటుంబ సభ్యుల ఆవేదన అరణ్య రోదనగా మిగిలిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం 8 మంది కుటుంబాల్లో విషాదం నింపిందని చెప్పారు. బాధితులను కాపాడటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు.

"కాంగ్రెస్ నాయకులు పబ్లిసిటీ కోసం టన్నెల్ వద్దకు వెళ్లి రావడం తప్ప ఇప్పటి వరకు చేసిందేం లేదు. ఒకసారి సమీక్ష చేయడం తప్ప చిత్తశుద్ధితో పరిష్కార మార్గం కోసం ప్రయత్నించింది లేదు. సహాయక బృందాలను సమన్వయం చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. నిర్ణయాలు తీసుకోవడంలో తీవ్ర ఆలస్యం జరిగింది. ఇది కాంగ్రెస్ ప్రభుత్వానికి చరిత్రలో నిలిచిపోయే అప్రతిష్ఠ. ఇంకెన్ని రోజులు కాలయాపన చేస్తారు? లోపల చిక్కుకున్న ఆరుగురి పరిస్థితేంటి? కూటి కోసం, కూలీ కోసం తెలంగాణకు వచ్చి ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి. తీవ్ర దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులకు అండగా నిలవాలి. ఎస్ఎల్‌బీసీ ప్రమాద ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరపాలి. వాస్తవాలను రాష్ట్ర ప్రభుత్వం బయటపెట్టాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

రేవంత్ లాంటి మోసగాడిని నమ్మినందుకు

## తెలంగాణ ఆగమైంది : కేటీఆర్

మొదటిపేజీ తరువాయి



రేవంత్ రెడ్డి చెప్పిన అవాస్తవ వాగ్దానాలు, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అసంబద్ధ హామీల వలన ప్రజల జీవితాలు సంక్షోభంలో పడినట్టు పేర్కొన్నారు. "ఒక్కసారి మోసపోతే అది మోసగాడి తప్పు, కానీ పదేపదే మోసపోతే అది మన తప్పవుతుంది. కాబట్టి ఈసారి ఎలాంటి ఎన్నిక వచ్చినా కాంగ్రెస్‌ను తిప్పికొట్టాలి" అని ప్రజలను హెచ్చరించారు.

జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పండి. "ఒకే తప్పును మళ్లీ చేయొద్దు. జీహెచ్ఎంసీతో పాటు రానున్న అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్‌ను తిరస్కరించండి" అంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రం మొత్తం దారుణంగా వెనుకబడుతున్నా, ఒక్క రేవంత్ రెడ్డియే ఆనందంగా ఉన్నట్టు కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. "రేవంత్ పాలన వలన మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలే అసంతృప్తిగా ఉన్నారు. ఇక ప్రజల పరిస్థితి చెప్పనవసరం లేదు. ఇది వాళ్ల విఫల పాలన ఫలితమే" అని అన్నారు.

మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి ప్రజల మధ్య తిరుగుతూ సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి చేస్తారని కేటీఆర్ ప్రశంసించారు. "డంపింగ్ యార్డ్ వంటి కీలక సమస్యలపై పోరాడుతున్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. మంచి నాయకుడిని గెలిపిస్తే, మంచి మార్పు సాధ్యమవుతుందని ఆయన నిరూపించారన్నారు.

కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉంది..

ఎన్నిక ఏదైనా, సందర్భం ఏదైనా - ఈసారి ప్రజలు కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ఆత్మ, తెలంగాణ స్వభిమానం కాపాడాలంటే, భరోసా నలుగురికీ కలిగించగల పార్టీ ఒక్కటే ఉంది -అది బీఆర్ఎస్ అని కేటీఆర్ పేర్కొన్నారు. సిల్వర్ జూబ్లీ ఉత్సవాల విజయవంతానికి కేటీఆర్ పిలుపునిచ్చారు. "ఈ నెల 27న పార్టీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుందాం. ఒక పార్టీగా 25 సంవత్సరాల ప్రయాణం ఎలాంటి మైలురాయో ప్రతి కార్యకర్తకు అర్థమవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో ఇది రెండవ ఘనత సాధించిన పార్టీగా మన గర్వం" అని కేటీఆర్ తెలిపారు. కేటీఆర్ సభకు ముందు భారీ ర్యాలీ నిర్వహించి కార్యకర్తలు స్వాగతం పలికారు. కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పలువురు నేతలు కేటీఆర్ సమక్షంలో భారత రాష్ట్ర సమితిలో చేరారు.

## మార్క్ శంకర్‌తో

### కలిసి హైదరాబాద్ చేరుకున్న పవన్‌కల్యాణ్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తన కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్ చేరుకున్నారు. సింగపూర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో పవన్ చిన్నకుమారుడు మార్క్ శంకర్ గాయపడి అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకుంటున్న సంగతి తెలిసిందే. శనివారం రాత్రి పవన్ తన సతీమణి అన్నాలెజినోవా, కుమారుడు మార్క్‌శంకర్, కుమార్తె పొలెనా అంజనా పవనోవాతో కలిసి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వచ్చారు. తన కుమారుడిని పవన్ ఎత్తుకుని ఎయిర్‌పోర్ట్ నుంచి బయటకు వస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

### ప్రధాని మోదీకి ప్రత్యేక కృతజ్ఞతలు: పవన్

మార్క్ శంకర్ ఆరోగ్య పరిస్థితిని తెలియజేస్తూ తాజాగా పవన్ కల్యాణ్ 'ఎక్స్' వేదికగా పోస్ట్ పెట్టారు. బాబు ఆరోగ్యం నిలకడగా ఉందని.. కోలుకుంటున్నాడని పేర్కొన్నారు. ప్రమాదం గురించి తెలిసి మార్క్ శంకర్ క్షేమాన్ని ఆకాంక్షించిన రాజకీయ నాయకులు, జనసేన నేతలు, అభిమానులు, కుటుంబసభ్యులు, స్నేహితులకు ఆయన ధన్యవాదాలు చెప్పారు. క్లిష్ట సమయంలో వారి సందేశాలు, ప్రార్థనలు తమ కుటుంబానికి ఎంతో ధైర్యాన్ని ఇచ్చాయన్నారు. ముఖ్యంగా ప్రధాని మోదీకి పవన్ కృతజ్ఞతలు చెప్పారు. సింగపూర్ అధికారులు, సింగపూర్‌లోని భారత హైకమిషన్ అధికారులు సమన్వయంతో అందించిన సాయం క్లిష్ట సమయంలో ఎంతో భరోసా ఇచ్చిందన్నారు.

## బిల్డర్ల సమస్యలు

### పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నాం

మొదటిపేజీ తరువాయి

పీఏసీ ఛైర్మన్ అరికెపూడి గాంధీ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు.

"హైదరాబాద్ అభివృద్ధికి బిల్డర్లు కృషి చేయాలి. నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ పార్టీ ఎంతో చేసింది. శంషాబాద్ ఎయిర్‌పోర్టు, ఔటర్ రింగ్‌రోడ్డు, కృష్ణా-గోదావరి జలాల తరలింపు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అయ్యాయి. ఈ అభివృద్ధిని ప్రభుత్వం మరింత ముందుకు తీసుకుపోతుంది. ప్రజారవాణా కోసం మెట్రోను అభివృద్ధి చేస్తున్నాం. హైదరాబాద్‌ను మరో సిలికాన్ వ్యాలీగా తీర్చిదిద్దుతాం.

పెట్టుబడులకు అనుకూలంగా ఫ్యూచర్ సిటీని తీసుకొస్తున్నాం. మూసీ ప్రక్షాళన చేపట్టి పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం. సైబరాబాద్ బిల్డర్స్ అసోసియేషన్‌కు మేం మరింత భరోసా ఇస్తున్నాం. మరింత లాభాలు వచ్చేలా అభివృద్ధి చేస్తాం. పెట్టుబడులు వస్తున్నాయి.. మరిన్ని భవనాలు నిర్మించండి. ప్రభుత్వంలో బిల్డర్స్ ఎప్పటికీ భాగస్వాములుగానే ఉంటారు. ప్రభుత్వ అభివృద్ధిలో మీ పాత్ర ఎప్పటికీ ఉంటుంది. ప్రజా ప్రభుత్వం వెన్నుదన్నుగా ఉంటుంది" అని ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు.

## టీజీపీఎస్సీకి క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదు: రాకేష్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: పూర్తి ఆధారాలతో గ్రూప్-1 అవకతవకలు బయటపెట్టామని, టీజీపీఎస్సీకి క్షమాపణ చెప్పే ప్రసక్తేలేదని భారాస నేత రాకేష్ రెడ్డి అన్నారు. అవకతవకలపై ప్రశ్నలకు టీజీపీఎస్సీ సమాధానాలు చెప్పట్లేదని, నోటీసులు ఇవ్వడంపై ఉన్న శ్రద్ధ అభ్యర్థులకు జవాబివ్వడంలో చూపాలని విమర్శించారు.

"టాప్ 500లో ఒక్క తెలుగు మీడియం అభ్యర్థి కూడా ఎందుకు లేదు? ప్రిలిమ్స్, మెయిన్స్‌కు వేర్వేరు హాల్‌టికెట్లు ఎందుకిచ్చారు?మహిళ, పురుషులకు వేర్వేరు కేంద్రాలు ఎందుకు ఏర్పాటు చేశారు? మొత్తం 46 సెంటర్లుంటే 2, 3 సెంటర్ల నుంచే టాపర్స్ ఎందుకు వచ్చారు?రిటైర్డ్, కాంట్రాక్టు లెక్చరర్లతో గ్రూప్-1 పేపర్లు దిద్దిస్తారా?గ్రూప్-1 అవకతవకలపై పోరాటం కొనసాగిస్తాం. దీనిపై న్యాయ విచారణ జరిపిస్తే.. అన్ని ఆధారాలు చూపిస్తాం. నేనే టీజీపీఎస్సీపై పరువు నష్టం దావా వేయబోతున్నా" అని రాకేశ్‌రెడ్డి తెలిపారు.

### ఆర్టీసీ బస్సు కింద పడి వ్యక్తి మృతి.. ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యం వల్లేనంటూ వాహనదారుల ఆందోళన

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్, కూకట్‌పల్లి: నగరంలోని బాలానగర్‌లో ఆర్టీసీ బస్సు కింద పడి ద్విచక్ర వాహనదారుడు మృతిచెందాడు. తనిఖీల్లో భాగంగా ట్రాఫిక్ పోలీసులు బైక్‌ను ఆపేందుకు యత్నించారు. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పడంతో వాహనదారుడు కిందపడ్డాడు. అదే సమయంలో వచ్చిన ఆర్టీసీ బస్సు అతడి తల పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యం వల్లే వ్యక్తి మృతిచెందాడంటూ వాహనదారులు ఆందోళనకు దిగారు. దీంతో జీడిమెట్ల నుంచి బాలానగర్ మార్గంలో భారీగా ట్రాఫిక్‌జామ్ అయింది. పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. వాగ్వాదానికి దిగిన వారిని పోలీసులు చెదరగొట్టారు.

### రెండురోజులు ఈ జిల్లాల్లో ఈదురుగాలులతో వర్షాలు.. ఎల్లో అలెర్ట్ జారీ చేసిన ఐఎండీ..

మొదటిపేజీ తరువాయి

తెలంగాణలో మరో రెండురోజులు పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. ఆగ్నేయ మధ్యప్రదేశ్, పరిసర ప్రాంతాల్లో విదర్భ మీదుగా తెలంగాణ మధ్య ప్రాంతాల వరకు ఉపరితల ఆవర్తనం నుంచి ద్రోణి సగటున సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తు వరకు కొనసాగుతుందని పేర్కొంది. కోస్తాంధ్ర, యానాం, మధ్య ప్రాంతాలు, పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తు వరకు కొనసాగుతోందని చెప్పింది. ఈ క్రమంలో తెలంగాణలో రాబోయే రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే, పలుచోట్ల ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీలకు పెరుగుతాయని పేర్కొంది. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అక్కడక్కడ వడగాలులు వీస్తాయని పేర్కొంది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. మరో వైపు ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట,

# జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమంలో అతిధిగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి

**కుత్బుల్లాపూర్ (మన వెలుగు) ఏప్రిల్ 13 :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని పెద్ద ఎత్తున పాదయాత్ర జై బాపూ, జై భీమ్,జై సంవిధాన్ అనే నినాదంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి మరియు ఎన్ ఎం సి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ హాజరయ్యారు వారితో పాటు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ , టిపిసిసి జనరల్ సెక్రటరీ నర్సారెడ్డి భూపతి రెడ్డి , మేడ్చల్ మల్కాజ్గిరి గ్రంథాలయ చైర్మన్ బొంగు నూరి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా హరివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ..మహాత్మ గాంధీ వారసత్వాన్ని, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అవమానపరచడం అంటే యావత్ మన దేశ ప్రజలను అవమానపరిచినట్లే అన్నారు.బిజెపి పార్టీ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ, ప్రజాసౌమ్య విలువలను కాలరాస్తూ రాజకీయ మనుగడ కోసం విద్వేషాలను రెచ్చగొడుతుందాన్నారు. బిజెపి అసమర్ధ పాలనపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఉద్దేశంతో బస్తి నుండి బజారు వరకు జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. డివిజన్ స్థాయి, మండల స్థాయి, బూత్ స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలు జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమంలో పాల్గొని






విజయవంతం చెయ్యాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, ఆవుల జగదీష్ యాదవ్, ఏనుగుల శ్రీకాంత్ రెడ్డి, ఎన్ జ్యోతి,ఏనుగుల మధుసూదన్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, ఏలూరి సత్య (నాని), లింగాల గంగాధర్, మామిళ్ళపల్లి శ్రీనివాస్, కృష్ణమరాజు, వీరబాబు, నారాయణరెడ్డి, జక్కా మధుసూదన్ రెడ్డి, మల్లికార్జున్, దాసరి మహేష్ కుమార్, అంజాద్, పంగా శ్రీనివాసరావు, ఫణి, శ్రీనివాస్ రాజు (మీసాల రాజు), ప్రేమ్ కుమార్, కోటేశ్వరి,మౌలేశ్వరరావు, సత్తిరెడ్డి,సరళ లక్ష్మణ్, ప్రభాకర్ రెడ్డి, నరసింహారావు, గౌస్, పితాని శ్రీనివాసరావు, బాలకృష్ణ, శ్రీనివాస్ (ఆటో),కిషోర్, అమూర్తయ్య, అంజత్, రామకృష్ణ, ఈశ్వర్, శ్రీను, రాజు, దుర్గారావు, సురేష్, నాగభూషణం, సురేందర్ బాబు, రామానాయుడు, నాగన్న, ఆంజనేయులు, కనకరాజు, వీరేష్, లోకేష్, రాముడు, దామోదర్, రాజు, రమేష్, శివ, శ్రీనివాస్, సునీల్, రాంబాబు, బుజ్జి,సరితా రెడ్డి, రాణి, మార్తమ్మ, సత్యవతి, నవ్య, పార్వతమ్మ, ఎం సత్యవతి, ఎన్ సత్యవతి, ఉష, ధనలక్ష్మి, వరలక్ష్మి, సునీత, పుష్ప, లక్ష్మి, నాగమణి, చిన్ని, వీరబాబు, రఘు, బక్క హరి, మొరంపొడి శ్రీనివాస్,తలారి సాయి, బాలాజీ, శ్రీరామ్ రెడ్డి, సురేష్ యాదవ్,మల్లికార్జున్, ప్రవీణ్ (లడ్డు), డింపుల్, మేకల క్రాంతి, మహిపాల్, ఏ సురేష్, నర్సింగ్ రావు, దినేష్, గిరీష్, రాజు యాదవ్,నారాయణరెడ్డి, హరీష్, విజయ్, ప్రశాంత్ రెడ్డి, గూడూరు మురళి, మేడా శ్రీనివాసరావు, అల్లాడి మహేష్,సయ్యద్ రఫీ, చిరంజీవి, వెంకట్, సాంబశివరావు, వీరయ్య, దాసరి మహేష్, ఆంజనేయ వర్మ, దివాకర్ రెడ్డి, తులసీదాస్, రమేష్, గోలి శ్రీనివాస్, మురళీకృష్ణ, లోకనాథం, సత్యనారాయణ రెడ్డి, సురేందర్ యాదవ్, మహమూద్, పవన్, సుబ్బు, నవీన్, జి జిత్తు, మల్లికార్జున్,విష్ణు,శరత్, సాయిరాజ్,గిరిజా కుమారి, యశోద, శ్రీదేవి, కరుణ, సునీత, నగీన, లక్ష్మి మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు

# మున్నూరు కాపుల దశ దిశ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న దావా వసంత





**జగిత్యాల (మన వెలుగు) ఏప్రిల్ 13 :** హైదరాబాద్ జలవిహార్ లో జరిగిన మున్నూరు కాపుల దశ దిశ ఆత్మీయ సమావేశంలో మున్నూరు కాపు నాయకులతో కలిసి పాల్గొన్న జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన కుల గణన సర్వేలో మున్నూరు కాపు లను కులగణనలో తక్కువ చూపిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులగణాల విషయంలో మున్నూరు కాపులకు అన్యాయం చేసిందని అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్ అసెంబ్లీలో అసెంబ్లీలో ఆమోదించడం జరిగిందని చేతులు దులుపుపోకుండా షెడ్యూల్ 9 ప్రకారం కేంద్ర ప్రభుత్వంతో ఆమోదించి వచ్చే ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని అన్నారు. లేకుంటే మున్నూరు కాపుల అందరూ కలిసి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామన్నారు అన్నారు. బీసీ ల ఆధ్వర్యంలో మున్నూరు కాపు సింహ గర్జన పేరుతో మే నెలలో పరేడ్ గ్రౌండ్లో పది లక్షల మందితో పెద్ద సభ నిర్వహించబోతున్నామని అన్నారు.

# పెన్షన్ సవరణ బిల్లు రద్దు చేయాలి

**- టీ పెన్షనర్ల రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్**

**- ఎంప్లాయిస్ వాయిస్ ఆధ్వర్యంలో చర్చావేదిక**

**జగిత్యాల (మన వెలుగు) ఏప్రిల్ 13 :** పెన్షన్లకు కోతలు పెట్టే కేంద్ర ప్రభుత్వము లోక సభ లో ఆమోదించుకున్న పెన్షన్ సవరణ బిల్లును వెంటనే రద్దు చేసుకోవాల ని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్ డిమాండ్ చేశారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని టీ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా సంఘ కార్యాలయంలో ఎంప్లాయిస్ వాయిస్ పత్రిక అభిమానుల ఆధ్వర్యంలో “పాత పెన్షన్ దారులకు హాని చేసే బిల్లు సవరణ ను రద్దు చేసుకోవాలి “అనే విషయంలో జిల్లా స్థాయి చర్చావేదిక నిర్వహించారు.ఈ వేదికలో ప్రధాన వక్తగా టీ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్ మాట్లాడుతూ 2025-2026 ఆర్థిక బిల్లులో భాగంగా లోక సభలో గుట్టు చప్పుడు కాకుండా పెన్షన్ సవరణ బిల్లును కేంద్రం



ఆమోదింప జేసుకోవడం పాత పెన్షన్ దారులకు గొడ్డలి పెట్టుగా పేర్కొన్నారు.పెన్షనర్లను పాత,కొత్త పెన్షన్ దారులుగా విడదీయడం ఈ బిల్లులోని ముఖ్యవిషయమన్నారు.ఈ బిల్లులోని సవరణల ద్వారా వేతన సవరణల ఫలితంగా వచ్చే లాభాలను వేతన కమిషన్ సిఫార్సులు అమలైన తేదీ తర్వాత పదవీవిరమణ పొందిన ఉద్యోగులకే వర్తిస్తాయి.ఆ తేదీకి ముందు రిటైర్ అయిన పెన్షనర్లకు పేకమిషన్ చేసిన సిఫార్సు చేసిన లాభాలు వర్తించవు.పెన్షన్ హక్కులు,లాభాలు ఎవరికి వర్తించాలో ప్రభుత్వమే నిర్ణయిస్తుంది .పెన్షనర్లను పదవీవిరమణ తేదీ ఆధారంగా వేరు చేయడం ఆసమంజసమని గతంలో సుప్రీంకోర్టు తీర్పు నిచ్చిందని,ఈ సవరణ బిల్లు ఆతీర్పును నిర్వీర్యం చేసేలా ప్రభుత్వంకు అధికారం కల్పిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బిల్లు చట్ట రూపం లోకి రాగానే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తే పెన్షనర్లు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతారని వ్యయసాయ మార్కెట్ పెన్షన్ దారుల జిల్లా అధ్యక్షుడు గౌరిశెట్టి విశ్వనాథం ఆందోళన వ్యక్తం చేశారు. పెన్షన్లకు కోతలు పెట్టె కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెన్షనర్లతో పాటు,అఖిల భారత స్థాయిలో ఉద్యోగులు,ఉపాధ్యాయులు,ప్రభుత్వ సంస్థల ఉద్యోగులు సంఘటితమై దేశ వ్యాప్తంగా సుదీర్ఘ ఉద్యమాన్ని సాగించాల్సిన అవసరం ఉందని పెన్షన్ సవరణ బిల్లును రద్దు చేయాలని పలువురు వక్తలు కేంద్ర ప్రభుత్వంను డిమాండ్ చేశారు.ఈ చర్చావేదికలో సంధాన కర్తగా రిటైర్డ్ తహశీల్దార్ పి.సి.హన్మంత్ రెడ్డి ,పెన్షనర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లంవిజయ్,కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథం,ఉపాధ్యక్షులు వెల్మల ప్రకాష్ రావు, ఎం.డి.యాకూబ్,ఆర్గనైజింగ్ కార్యదర్శి పూసాల ఆశోక్ రావు, సంయుక్త కార్యదర్శి దిండిగాల విఠల్,జగిత్యాల యూనిట్ అధ్యక్షుడు బి.రాజేశ్వర్,కోరుట్ల అధ్యక్షుడు పబ్బా శివానందం,ధర్మపురి అధ్యక్షుడు కండ్లే గంగాధర్,మెట్ పల్లి అధ్యక్షుడు వి.ప్రభాకర్ రావు,మల్యాల అధ్యక్షుడు ఎం.డి.యాకూబ్,జిల్లా,యూనిట్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆత్మ రక్షణకు కరాటే సాధన అవసరం

**- ఇండియన్ పబ్లిక్ పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్**

**- ప్రిన్సిపల్ కృష్ణప్రియ**

**సుల్తానాబాద్ (మన వెలుగు) ఏప్రిల్ 13 :**





ఆత్మ రక్షణకు కరాటే సాధన అవసరమని ఇండియన్ పబ్లిక్ పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ అన్నారు. శనివారం స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాల ఆవరణలో ఒకినవ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ గ్రాండ్ మాస్టర్ కె వసంత్ కుమార్ చీఫ్ ఎగ్జామినర్,బ్లాక్ బెల్ట్ వారు హాజరయ్యారు.ఈ సందర్భంగా చైర్మన్ సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ మాట్లాడుతూ క్రీడాకారులను అభినందిస్తూ కరాటే,మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల ఏకాగ్రత, పట్టుదల,మెమొరీ పవర్, సాహసం పెరుగుతుందని,ఆత్మరక్షణకు తోడ్పడుతుందని అన్నారు. గ్రాండ్ మాస్టర్ కే వసంత్ కుమార్ మాట్లాడుతూ చదువుతోపాటు కరాటే, మార్షల్ ఆర్ట్స్ క్రీడలను ప్రోత్సహిస్తున్న ఇండియన్ పబ్లిక్ పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. చిన్న వయసులోనే కరాటే, మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల మెంటల్ గా స్టామినా కూడా పెరుగుతుందని,రోగాలను దూరం చేస్తుందని, తల్లిదండ్రులు చిన్నారులను ప్రోత్సహించాలని అన్నారు. అనంతరం కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ లో విజయం సాధించిన క్రీడాకారులకు బెల్ట్ లను సర్టిఫికెట్స్ లను ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో కరాటే కోచ్ కనకేష్, పీఈటీలు సత్యం,ఇక్బాల్,సతీష్, తల్లిదండ్రులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు ఉచిత వేసవి శిక్షణ



**నిజామాబాద్ ప్రతినిధి (మనవెలుగు) ఏప్రిల్ 13 :** నిజామాబాద్ జిల్లాలోని మహిళా విద్యార్థులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ శిభిరాన్ని నిర్వహించనున్న ట్లు పోలీసు కమిషనర్ సాయి చైతన్య వెల్లడించారు. విద్యార్థినిలు తమను తాము రక్షించుకోవడానికి సెల్ఫ్ డిఫెన్స్ (ఆత్మసంరక్షణ ), భవిష్యత్తు నిర్మించుకోవడానికి మోటివేషన్ ( ప్రేరణ) సమాజంలో మహిళలపై జరిగే నేరాల పట్ల పోలీస్ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ ఏప్రిల్ 25 నుండి మే 2వ తేది వరకు నిర్వహించనున్నామన్నారు. నిజామాబాద్ లోని ఆర్మూర్ రోడ్డులో గల ఆర్ బివిఆర్ఆర్ స్కూల్ లో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించడం జరగుతుందన్నారు. 9,10, ఇంటర్మీడియట్ విధ్యార్థినులకు ఈ శిక్షణ శిబిరానికి అర్హులన్నారు. వీరికి ఉదయం అల్పాహారం ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తమ పేర్లను ఈ నెల 13 నుంచి 24వ తేది వరకు ఫోన్ నెంబర్ : 90009 94312కు సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

# ప్రశాంతంగా కొనసాగిన హనుమాన్ జయంతి ఉత్సవాలు





**కొండగట్టు (మన వెలుగు) ఏప్రిల్ 13 :** అర్ధరాత్రి సమయంలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అధికారులను, సిబ్బందిని సమన్వయ పరుస్తూ సూచనలు చేసిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్.కొండగట్టు చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులు స్వామి వారిని దర్శించుకునేలా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. నిన్న అర్ధరాత్రి సమయంలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అధికారులకు మరియు సిబ్బందికి సూచనలు చేస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేపట్టారు.

# స్వర్గీయ దుదిల్ల పాదరావుకి ఘన నివాళులు

**మెట్ పల్లి (మన వెలుగు) ఏప్రిల్ 13 :** టీపీసీసీ డెలిగేట్ సుజిత్ రావు నివాసంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ల పాదరావు 26వ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయునికి ఘన నివాళులు అర్పించిన మెట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్. అనంతరం వారు మాట్లాడుతూ.. వారు చేసిన సేవలు చిరస్మరణీయం అని అన్నారు.ఈ కార్యక్రమం లో రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ సెల్ జాయింట్ కోఆర్డినేటర్ వాకిటి సత్యం రెడ్డి, మెట్ పల్లి పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఖుతుబ్ పాషా,రాష్ట్ర సేవాదళ్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అందె మారుతీ,జిల్లా




యూత్ కాంగ్రెస్ మీడియా కోఆర్డినేటర్ కూన రాకేష్,వెంకట గిరి,యండి జఫర్,బైండ్ల శ్రీకాంత్, కోరే రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 21 ప్యాకేజీ పనులను సత్వరమే పూర్తి చేయాలి




**నిజామాబాద్ ప్రతినిధి,(మన వెలుగు) ఏప్రిల్13 :**
ప్యాకేజీ పనులను సత్వరమే పూర్తి చేయాలని న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎన్ఆర్ భవన్ లో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో అనేక రైతాంగా పోరాటాల ఫలితంగా గోదావరి నదిపై అల్లి సాగర్ గుత్ప ఎత్తిపోతలు సాధించుకున్నామని తెలిపారు. దీనితోపాటు మంచిప ప్రాజెక్టు ద్వారా గాడ్కోల్ సెగ్మెంట్లో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ పరిధిలో 5,6 మండలాల్లో 84 వేల ఎకరాలకు సాగు నీరు అందించెందుకుగాను మంచిప్ప ప్రాజెక్టును నిర్మిస్తున్నారనితెలిపారు. ఈ ప్రాజెక్టు పనులు గత 2 సంవత్సరాలుగా నిలిపేసారని 21ప్రాజెక్టు పనులకు తగిన నిధులు కేటాయించి పనులను వెంటనే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ సాధన ఉద్యమం అంతా నీళ్లు,నిధులునియమాల కొరకు జరిగిందని ఆ ఉద్యమం నుంచి వచ్చిన వారే ఈ ప్రాంత శాసనసభ్యులు భూపతి రెడ్డిని అన్నారు. ఈ 21 ప్యాకేజ్ పనులను వెంటనే పనులు ప్రారంభించేందుకు ప్రభుత్వం తగిన విధంగా స్పందించేందుకు వారు ప్రయత్నించాలని కోరారు. మంచిప్ప నుండి గడ్కోల్ వరకు ఈ పరిధిలో 80 గ్రామాలలోని 84 వేల ఎకరాలకు సాగునీరు అందెందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. దీనితో పాటు ఈ ప్రాంతంలోని చెరువులు,కుంటలు నింపినట్లయితే పశువులకు దాహార్తి తీర్చటంతోపాటు పాటు భూగర్భ జలాలు పెరిగి బోర్లలో నీటి నిల్వలు పెరుగుతాయని అన్నారు. మొన్న ఈ రభి సీజన్ పంటలు చివరి దశలో నీళ్లు అందక చేతుకొచ్చిన వరి,మొక్క జొన్న తదితర పంటలు దెబ్బతిన్నాయని అన్నారు. ఇప్పటికే వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి 60శాతం పనులు జరిగాయని మిగతా పనులకు,నిధులు కేటాయించి పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంచిప్ప ప్రాజెక్టు నిర్మాణంలో నిర్వాసితుల సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే భూపతి రెడ్డి వారితో మాట్లాడాలని ,నిర్వాసితుల సమస్యలను 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూమికి బదులు భూములు, ఇండ్లు,ఇతర అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ ప్రాజెక్టు పనులు నిలిచి రెండు సంవత్సరాలు అవుతుందని ఈ విధంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కాలయాపన చేసినట్లయితే ఈ ప్రాంత రైతుల చే ఆందోళన చేపట్ట వలసి వస్తుందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య, శివకుమార్ పాల్గొన్నారు.

# విద్యా వ్యాపారానికి వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలి

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) ఏప్రిల్ 13 :**
విద్యా వ్యాపారానికి వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలని పూర్వ పి డి ఎస్ యూ నాయకులు సీనియర్ న్యాయవాది పరుచూరి శ్రీధర్ విద్యార్థులకు పిలుపునిచ్చారు.నిజామాబాద్ నగరంలో ప్రగతిశీల విద్యార్థి సంఘం నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పి డి ఎస్ యూ ముఖ్య కార్యకర్తల సమావేశం నీలం రామచంద్రయ్య భవన్లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పరుచూరి శ్రీధర్ మాట్లాడుతూ విదేశాలలో విద్యను ప్రభుత్వాలు ఉచితంగా అందిస్తుంటే మనదేశంలో మాత్రం విద్య వ్యాపారమైందని అన్నారు,
విద్యాభివృద్ధికి కొఠారి కమిషన్ కేంద్ర బడ్జెట్లో 10% శాతం నిధులు రాష్ట్ర బడ్జెట్లో 30% నిధులు కేటాయించాలని సూచిస్తే కేంద్రంలో 2% శాతం రాష్ట్రంలో 7% శాతానికి మించి కేటాయించటం



లేదని,
కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా కార్పోరేటీకరణ,ప్రైవేటీకరణ, కాషాయీకరణను ప్రోత్సహించడం దుర్మార్గమని అన్నారు.ఉన్నత వర్గాలు అధిక డబ్బులిచ్చి ఉన్నత విద్య ను కొనుక్కుంటున్నారని పేద విద్యార్థులు ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారిందని చెప్పారు. విద్యార్థులు మొబైల్, అశ్లీలత,మత్తు మారకద్రవ్యాలతో బానిసలు కాకుండా సమాజాన్ని అర్థం చేసుకొని పాలకుల అనుసరిస్తున్న విధానాలను ప్రశ్నించాలని పిలుపునిచ్చారు.
రాజకీయాలకు మన జీవితాలు ముడిపడి ఉన్నాయని , ప్రతి సమస్యను నిర్దిష్టంగా పరిశీలన చేయడం నేర్చుకోవాలని అన్నారు.మరో వక్త మాజీ పి డి ఎస్ యూ నాయకులు జి.రమేష్ మాట్లాడుతూ జిల్లాలో పి డి ఎస్ యూ అనేక పోరాటాలు చేసి విజయాలు సాధించిందని అందులో ముఖ్యంగా జిల్లాలో సంక్షేమ హాస్టల్స్ ఏర్పాటు ,ఖలీల్వాడి స్కూల్ గ్రౌండ్ రక్షణ కోసం, మెడికల్ కళాశాల ఏర్పాటు,తెలంగాణ యూనివర్సిటీ, గిరిరాజ్ కాలేజ్ లో పీజీ సెంటర్ ఏర్పాటు కోసం ఉద్యమం చేసి విజయం సాధించిందని,
జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాల మహిళా డిగ్రీ కళాశాల ఇండోర్ స్టేడియం కోసం పి డి ఎస్ యూ విద్యార్థి సంఘం పోరాడాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్ గౌతం కుమార్, జన్నారపు రాజేశ్వర్, జిల్లా సహాయ కార్యదర్శులు ప్రిన్స్,దేవిక

## కాంగ్రెస్ అంబేడ్కర్ ను అడుగడుగున అవమానించింది



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) ఏప్రిల్ 13 :**
నగరంలోని పూలాంగ్ చౌరస్తాలో ఆదివారం గావ్ చలో- బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహ శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ అర్వింద్,అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ధన్ పాల్ సూర్యనారాయణ,పైడి రాకేష్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందదర్భంగా ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ అంబేడ్కర్ ను అడుగడుగున అవమానించిందన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం బడుగు బలహీన వర్గాలను పావులుగా వాడుకుంటుందని ఆరోపించారు. అంబేడ్కర్ ను ఓడగొట్టిందే కాంగ్రెస్ పార్టీ అన్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం అంబేడ్కర్ పాటు పడ్డాదన్నారు.నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ పెద్దలు అంబేడ్కర్ కి భారతరత్న ఇవ్వలేదన్నారు. బీజేపీ చొరవతోనే అంబేడ్కర్ కు భారతరత్న లభించిందన్నారు. అంబేడ్కర్ పుట్టుక నుంచి మరణం వరకు వారు జీవించిన ఐదు ప్రదేశాలను పంచ తీర్థాల పేరుతో టూరిజం హాబ్ గా అభివృద్ధి చేస్తున్న ఘనత బీజేపీదే అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి,బీజేపీ జిల్లా నాయకులు,మండల అధ్యక్షులు,మాజీ కార్పొరేటర్లు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సమసమాజ స్వాప్నికులు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్

అంతరాలు, అసమానతలు లేని సమాజ స్థాపనే అంబేద్కర్ జీవిత ఆశయమన్నారు వేమిరెడ్డి దంపతులు. భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి ఘన నివాళులు అర్పిస్తూ పత్రికా ప్రకటన విడుదల చేశారు. అణగారిన వర్గాలకు సమన్యాయం అందించే దిశగా భారత రాజ్యాంగంలో అంబేద్కర్ అనేక అంశాలకు చోటు కల్పించారని వారు తమ ప్రకటనలో పేర్కొన్నారు.

# డాక్టర్ బెజ్జారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉచిత రక్త పరీక్షలు, రోగులకు పండ్ల పంపిణీ





**మెట్ పల్లి (మన వెలుగు) ఏప్రిల్ 13 :**
మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిల్ల శ్రీపాదరావుకి ఘన నివాళులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిల్ల పాదరావు 26 వర్ధంతి సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ బెజ్జారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉచిత రక్త పరీక్షలు మరియు రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ మహనీయునికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో మంథని నియోజక వర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని వారు కొనియాడారు ఈ కార్యక్రమంలో మెట్పల్లి పట్టణ కార్యదర్శి కంబ సురేష్ మరియు అవుట్ల లక్ష్మణ్ సాగర్ సత్యనారాయణ ప్రశాంత్ పాల్గొన్నారు

# బిజెపి జనగాం చలో బస్తి కార్యక్రమం



**కొడంగల్ (మన వెలుగు) ఏప్రిల్ 13 :**
బిజెపి గావ్ చలో బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా ఆదివారం బొంరాస్ పేట్ భారతీయ జనతా మండల శాఖ మెట్లుకుంట గ్రామంలో 190 బూత్ అధ్యక్షురాలు కమల, ప్రధాన కార్యదర్శి లత, ఆధ్వర్యంలో గావ్ చలో బస్తి చలో కార్యక్రమానికి ముఖ్య అతిథి కొడంగల్ అసెంబ్లీ ఇన్చార్జి బంటు రమేష్ రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యులు బాబయ్య నాయుడు గ్రామ పంచాయతీ పరిధిలో 192 పోలింగ్ బూత్ లో పర్యటన చేసి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్ని అడిగి తెలుసుకుని కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పేద ప్రజలకు ఆయుష్మాన్ భరత్. పీఎం కిసాన్ యోజన,యుజ్వల యోజన, ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన,గ్రామ పంచాయతీలకు సీసీ రోడ్లు,గ్రామ పంచాయతీ భవనాలు, పల్లె దవాఖానాలు, రైతులకు సబ్సిడీ డిఏపీ, యూరియా,అంగన్వాడి పిల్లలకు భోజనవ్యవస్థ,ఉచిత బియ్యం, వక్స్ బోర్డ్ బిల్లు ,గురించి ప్రజలకు తెలియ జేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి ముకుందు జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి జగదీష్ సాగర్,మండల ఎస్సీ మోర్చ అధ్యక్షులు జనార్ధన్ బూత్ ఇన్చార్జిలు వెంకట్,మల్లేశం, మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గురుద్వారాను సందర్శించిన పోలీస్ కమిషనర్

**నిజామాబాద్ ప్రతినిధి(మన వెలుగు) ఏప్రిల్ 13 :**
నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గల గాజుల్పేట్ లో గురుద్వారాను వైశాఖీ సందర్భంగా నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదివారం సందర్శించారు. అనంతరం ఊరేగింపు జరిగే మార్గాన్ని క్షుణ్ణంగా పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో గురుద్వారా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఉచిత పథకాలతో మోసం చేస్తున్న పార్టీలు



**నారాయణపేట ప్రతినిధి (మన వెలుగు) ఏప్రిల్ 13 :**
బహుజనులకు రాజ్యాధికారం లభించినప్పుడే వారి జీవితాల్లో వెలుగు లభిస్తుందని మార్పులు వస్తాయని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి నాగన్న అన్నారు.ఆదివారం నారాయణపేట జిల్లా నారాయణపేట అంబేద్కర్ భవన్లో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ బహుజనుల ఆత్మ గౌరవం బహుజనులతోటే సాధ్యమవుతుందని బహుజన్ పార్టీతోనే సాధ్యమవుతుందని అన్నారు, ఉచిత పథకాలతో పార్టీలన్నీ బహుజనులను మోసపూరిత మాటలు చెప్పి లొ బరురుచుకొని ఓట్లు వేయించుకొని మోసం చేస్తున్నాయని అభిప్రాయపడ్డారు, పార్టీ అభివృద్ధికి కార్యకర్తల సంక్షేమానికి వారు కష్టపడి పనిచేసే మనస్తత్వం గల కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారికి ఎల్లప్పుడూ తోడుగా ఉంటామని మరియు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన గ్రంథాల సంస్థ చైర్మన్



**కోస్గి (మన వెలుగు) ఏప్రిల్ 13 :**
కోస్గి మున్సిపల్ పరిధిలోనీ 4వ వార్డు సంపల్లి లో సంపల్లి నుండి నాగసంపల్లి,మరియు సంపల్లి నుండి సారంగరావు పల్లి బిటి రోడ్డు సుమారు 6.70 కోట్ల రూపాయలతో ఈ రోజు పనులు ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్ కుమార్, కోస్గి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు రఘువర్ధన్ రెడ్డి,మున్సిపల్ అధ్యక్షులు బెజ్జు రాములు ,పిఏసిఎస్ చైర్మన్ భీం రెడ్డి ,మండల కిసాన్ సెల్ అధ్యక్షులు మోహన్ రెడ్డి ,మరియు వేణుగోపాల స్వామి ఆలయ చైర్మన్ కృష్ణ మూర్తి,మరియు కోడిగంటి హరి,వేణు గోపాల్, సంపల్లి గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు ,ప్రజలు పాల్గొన్నారు.

## అర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడి ఈగ సంజీవ్ రెడ్డి



**నిజామాబాద్,ప్రతినిధి (మనవెలుగు ) ఏప్రిల్ 13 :**
అసోసియేషన్ అధ్యక్షుడిగా ఈగ సంజీవ్ రెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం నిజామాబాద్ నగరంలోని సంజీవరెడ్డి నగర్ కాలనీలో అర్చరీ అసోసియేషన్ ఎన్నికను ఎన్నికల అధికారి గంట ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 2025-29 కాలానికి కార్యవర్గాన్ని ఏకగ్రవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఎంవీ సుబ్బారావు,కోశాధికారిగా మంథని బాలగంగాధర్,ప్రధాన కార్యదర్శిగా కే. గంగరాజు,సంయుక్త కార్యదర్శిగా ఈగ పోతన్న,సభ్యుడిగా భదవత్ గణేశ్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు తెలంగాణ రాష్ట్ర అర్చరీ అసోసియేషన్ అబ్జర్వర్ గా పి అరవింద్ కుమార్,జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అబ్జర్వర్ గా అంద్యాల లింగన్న,డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ అబ్జర్వర్ మీసాల ప్రశాంత్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. కార్యక్రమంలో బోర్గాం సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి,గాదారి సంజీవరెడ్డి, సయ్యద్ నాభి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చెన్నకేశవుని రధోత్సవానికి భారీ బందోబస్తు


● **కలిగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట నారాయణ....**

వింజమూరులో నేడు జరగనున్న శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామి వారి రథోత్సవం ప్రక్రియకు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు కలిగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట నారాయణ తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ మరియు కావలి డిఎస్పీ శ్రీధర్ ల సూచనలు సలహాలను పాటిస్తూ రథోత్సవమును విజయవంతంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు గావించడం జరిగిందన్నారు. రథోత్సవం సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా దాదాపుగా 100 మందికి పైగా మెన్ మరియు ఉమెన్ పోలీసు సిబ్బందిని నియమించడం జరిగిందని పేర్కొన్నారు.అదే విధంగా ఆదివారం రాత్రి యర్రబల్లిపాలెంలోని ప్రధాన దేవస్థానం వద్ద నుండి మండపం వరకు సాగిన స్వామివారి కళ్యాణోత్సవం ఉభయానికి సైతం పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు.వింజమూరులో ఘనంగా జరిగే రథోత్సవమునకు విచ్చేసే స్థానిక,పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు,ప్రజలకు సిఐ వెంకట నారాయణ ముందుగా రథోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ నేపథ్యంలో ప్రజలందరూ కూడా శ్రీ చెన్నకేశవస్వామి వారి రథోత్సవంలో ఉత్సాహంగా పాల్గొని అత్యంత భక్తి శ్రద్దలతో దేవ దేవేరులను సందర్శించుకుని ఉత్సవమును ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తి చేసుకునే దిశగా పోలీస్ ఇతర శాఖలకు చెందిన



# విక్రమ్ కుమారుడితో అనుపమ డేటింగ్..? ఫొటో వైరల్

నటి అనుపమ పరమేశ్వరన్ , యువ నటుడు ధ్రువ్ విక్రమ్ ప్రేమలో పడినట్లు వార్తలు వస్తున్నాయి. వీరిద్దరికి సంబంధించిన ఓ ప్రైవేట్ ఫొటో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. ఇందులో వీరిద్దరూ ముద్దు పెట్టుకుంటూ కనిపించారు. దీంతో వీరు డేటింగ్‌లో ఉన్నారని స్థానిక పత్రికల్లో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. మరోవైపు, వీరిద్దరూ 'బైసన్' సినిమాలో నటిస్తున్నారు. మారి సెల్వరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో ధ్రువ్ కబడ్డీ ప్లేయర్‌గా కనిపించనున్నారు. ఇందులో అనుపమ ఆయన ప్రియురాలి పాత్రలో నటిస్తోంది. ప్రస్తుతం వైరల్‌గా మారిన ఫొటో ఆ సినిమాకు సంబంధించినదే అయి ఉంటుందని కొంతమంది నెటిజన్లు అంటున్నారు.కేరళకు చెందిన అనుపమ.. 'ప్రేమమ్' (మలయాళ చిత్రం)తో నటిగా ఎంట్రీ ఇచ్చారు. తొలి చిత్రంతోనే ఆకట్టుకున్నారు. 'అ.. ఆ..'తో తెలుగు తెరకు పరిచయమైన ఆమె ఇక్కడ వరుస సినిమాలు చేస్తూ సినీ ప్రియులకు చేరువయ్యారు. గతేడాది ఆమె నటించిన 'టిల్లు స్క్వేర్' మంచి విజయాన్ని అందుకుంది. ప్రస్తుతం ఆమె 'పరదా' అనే తెలుగు సినిమాతోపాటు పలు మలయాళం, తమిళ ప్రాజెక్ట్‌లు చేస్తున్నారు. ప్రముఖ నటుడు విక్రమ్ తనయుడే ధ్రువ్. 'అర్జున్ రెడ్డి'కి రీమేక్‌గా రూపొందిన 'ఆదిత్య వర్మ'తో ధ్రువ్ హీరోగా పరిచయం అయ్యాడు. అనంతరం తండ్రితో కలిసి 'మహాన్' కోసం వర్క్ చేశాడు.



# ఈ పాన్ ఇండియా చిత్రాల కోసం రాజమౌళి వెయిటింగ్


'ఆర్‌ఆర్‌ఆర్: బిహైండ్ అండ్ బియాండ్' డాక్యుమెంటరీ ప్రమోషన్స్ కోసం రాజమౌళి ఇటీవల జపాన్‌కు వెళ్లిన విషయం తెలిసిందే. ప్రమోషన్స్‌లో భాగంగా ఆయన అక్కడి మీడియాతో ముచ్చటించారు. 'ఆర్‌ఆర్‌ఆర్' మూవీ చిత్రీకరణ ఎలా జరిగిందో తెలియజేస్తూ డాక్యుమెంటరీని సిద్ధం చేయడం ప్రత్యేకంగా అనిపించిందన్నారు. తమ చిత్రాన్ని ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు చెప్పారు."ఒక ప్రేక్షకుడిగా మీరు ఏయే చిత్రాలను చూసేందుకు ఎదురుచూస్తున్నారు?" అని ప్రశ్నించగా.. రాజమౌళి ఆసక్తికర సమాధానం చెప్పారు. ఎన్టీఆర్- ప్రశాంత్‌నీల్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్), ప్రభాస్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రానున్న 'స్పిరిట్' తోపాటు రామ్‌చరణ్ నటిస్తోన్న 'పెద్ది' మూవీ కోసం ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. బుచ్చిబాబు దర్శకత్వం వహిస్తోన్న ఈ సినిమా గ్లింప్స్ ఇటీవల విడుదలైందని ఆయన అక్కడి వారికి తెలియజేశారు.'డ్రాగన్' షూట్ దశలో ఉన్న సంగతి తెలిసిందే. ఈ నెల 22 నుంచి ఎన్టీఆర్ రెగ్యులర్ షూట్‌లో పాల్గొననున్నారు. వచ్చే ఏడాది కానుకగా ఈ సినిమా విడుదల కానుంది. 'స్పిరిట్'కు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. సందీప్ లొకేషన్స్ వేటలో పడ్డారు. ఇటీవల మెక్సికో వెళ్లి వచ్చారాయన. పవర్‌ఫుల్ పోలీస్ డ్రామాగా ఇది సిద్ధం కానుంది. రామ్‌చరణ్ 'పెద్ది' వేసవి కానుకగా వచ్చే ఏడాది మార్చి 27న విడుదల కానున్న విషయం తెలిసిందే. ఈసినిమా చిత్రీకరణ జరుగుతోంది. ఈ మూడూ పాన్ ఇండియా చిత్రాలే కావడం విశేషం.'ఆర్‌ఆర్‌ఆర్: బిహైండ్ అండ్ బియాండ్' విషయానికొస్తే.. సుమారు 3 ఏళ్ల ఈ సినిమా ప్రయాణానికి సంబంధించి 20టీబీ ఫుటేజ్ రాగా దాన్ని ఎడిట్ చేసి.. బెస్ట్ మూమెంట్స్‌ను తీసుకుని 1:38 గంటల నిడివితో ఈ డాక్యుమెంటరీని రూపొందించారు. యాక్షన్ సీక్వెన్స్ షూటింగ్ విజువల్స్, చిత్రబృందం అభిప్రాయాలు తదితర సంగతులు ఇందులో చూపించారు. నెట్‌ఫ్లిక్స్ లో అందుబాటులో ఉంది. రాజమౌళి ప్రస్తుతం మహేశ్‌బాబుతో సినిమా చేస్తున్నారు. SSMB 29గా ఇది ప్రచారంలో ఉంది.

# 'ఈమేంటి ఇలా అయింది?'.. నెటిజన్ల ట్రోల్స్.. స్పందించిన నటి



లుక్స్ విషయంలో బాలీవుడ్ నటి మౌనీ రాయ్ కొన్ని రోజులుగా సోషల్ మీడియా వేదికగా ట్రోల్స్ ఎదుర్కొంటున్నారు. తన తదుపరి చిత్రం 'ది భూత్నీ' సినిమా ఈవెంట్‌లో ఆమె పాల్గొన్న నాటి నుంచి ఈ విమర్శలు వెల్లువెత్తాయి. అందం కోసం ఆమె సర్జరీ చేయించుకున్నారని.. దాంతో ముఖ కవళికలు మారిపోయానని కామెంట్స్ చేశారు. నెట్టింట వైరల్‌గా మారిన ఈ విమర్శలపై తాజాగా ఆమె స్పందించారు. వీటిని తాను ఏమాత్రం పట్టించుకోనన్నారు. "నాపై కామెంట్స్ చేసేవాళ్లు నాకు కనిపించరు. కాబట్టి వాళ్ల మాటలకు బాధపడాల్సిన అవసరం లేదు. వాటిని పెద్దగా పట్టించుకోను. ఇతరులను ట్రోల్ చేస్తూ ఆనందాన్ని పొందాలనుకుంటే మాత్రం మనం ఏం చేస్తాం. ఎవరికి నచ్చినట్లు వాళ్లని ఉండనివ్వండి" అని అన్నారు.సీరియల్ నటిగా కెరీర్ ప్రారంభించి సినిమాల్లోకి అడుగుపెట్టారు మౌనీ రాయ్ . 'నాగిని' సీరియల్‌తో అన్ని భాషల్లో అభిమానులను సొంతం చేసుకున్నారు. అక్షయ్‌కుమార్ నటించిన 'గోల్డ్' చిత్రంతో వెండితెరకు పరిచయమయ్యారు. 'బ్రహ్మాస్త్ర' చిత్రంలో నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించారు. ప్రస్తుతం ఆమె 'ది భూత్నీ'లో నటిస్తున్నారు. సంజయ్ దత్ ప్రధాన పాత్రలో నటించిన ఈ హారర్ మూవీ ఏప్రిల్ 18న విడుదల కానుంది. ఈ సినిమా తనకు చాలా ప్రత్యేకమని మౌనీ ఇటీవల ఓ కార్యక్రమంలో తెలిపారు. ఇందులోని స్టంట్స్ కోసం డూప్స్‌ను ఉపయోగించలేదని.. తానే స్వయంగా చేశానని చెప్పారు. 'బ్రహ్మాస్త్ర', 'నాగిని'తో నటిగా తాను ఎన్నో విషయాలు నేర్చుకున్నానని గుర్తు చేసుకున్నారు.

# కేరళలో టైగర్ కా హుకుం



"టైగర్ కా హుకుం" అంటూ ముత్తువేల్ పాండియన్‌గా మరోసారి ప్రేక్షకుల్ని అలరించేందుకు 'జైలర్ 2'తో సిద్ధమవుతున్నారు కథానాయకుడు రజనీకాంత్. 'జైలర్'కు సీక్వెల్‌గా నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కిస్తున్న ఈ బహుభాషా చిత్రాన్ని సన్‌పిక్చర్స్ సంస్థ నిర్మిస్తోంది. రజనీకి భార్యగా రమ్యకృష్ణ నటిస్తున్నారు. మిర్నా మేనన్, ఎస్.జె.సూర్య తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా కేరళలో కొత్త షెడ్యూల్ ప్రారంభించుకుంది. దీనిలో భాగంగా ప్రస్తుతం రజనీ, రమ్యకృష్ణ, మిర్నాలపై కుటుంబ నేపథ్య సన్నివేశాలు తెరకెక్కిస్తున్నారు. ఈ షెడ్యూల్‌తోనే రమ్యకృష్ణ ఈ చిత్ర సెట్లోకి అడుగు పెట్టినట్లు సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది. తాను రజనీకి విలన్‌గా నటించిన 'నరసింహ' సినిమా 26ఏళ్ల క్రితం ఏప్రిల్‌లో విడుదలైనట్లు ఈ సందర్భంగా ఆమె గుర్తు చేసుకున్నారు. స్టైలిష్ యాక్షన్ థ్రిల్లర్‌గా ముస్తాబవుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకొచ్చే అవకాశమున్నట్లు ప్రచారం వినిపిస్తోంది. ఈ సినిమాకి అనిరుధ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

# అగ్నితో మండుతున్న మనసు



తమిళ కథానాయకుడు సూర్య, పూజా హెగ్డే జంటగా నటించిన చిత్రం 'రెట్రో'. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వం వహించారు. స్టోన్ బెంచ్‌ఫిల్మ్స్, 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. ఈ సినిమా మే 1న ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా ప్రచార కార్యక్రమాల్ని పరుగులు పెట్టిస్తోంది చిత్రబృందం. ఈ నేపథ్యంలోనే తాజాగా ఈ సినిమాలోని 'ది వన్' అనే మూడో పాటను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. "భయంతో నిండిన మనసు.. అగ్నితో మండుతున్న మనసు.." అంటూ సాగుతున్న ఈ పాటలో యాక్షన్ అవతారంలో కనిపిస్తూ సినీప్రియుల దృష్టిని ఆకర్షిస్తున్నారు సూర్య. సిద్ శ్రీరామ్, సంతోశ్ నారాయణ్ ఆలపించారు. ప్రేమ, వినోదం, యాక్షన్ అంశాల మేళవింపుతో ఈ చిత్రాన్ని రూపొందించారు.

# ఏడాదిలో 15 బ్రాండ్స్ వదులుకున్న సమంత.. కారణమేమిటంటే..?



సెల్ఫ్ లవ్, ఆరోగ్యం, ప్రశాంతతకు గత కొంతకాలంగా ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు నటి సమంత. నచ్చిన చిత్రాల్లో యాక్ట్ చేస్తూ తన అభిరుచులకు అనుగుణంగా ఆమె జీవిస్తున్నారు. వ్యక్తిగత సంరక్షణ, మహిళా సాధికారిత వంటి అంశాలను ఉద్దేశించి తరచూ ఇన్‌స్టా వేదికగా సందేశాలు ఇస్తున్నారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. మానసిక ఆరోగ్యం, వాణిజ్య ప్రకటనలు వంటి అంశాలపై ఆమె చర్చించారు. ఇందులో భాగంగా ఇటీవల తాను ఎన్నో బ్రాండ్స్ వదులుకున్నట్లు చెప్పారు. రూ. కోట్లు వస్తున్నప్పటికీ వాటిని పక్కన పెట్టడానికి ఒక బలమైన కారణం ఉందన్నారు."20 ఏళ్ల వయసులో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టా. అప్పట్లో సక్సెస్‌కు నిర్వచనం చాలా విభిన్నంగా ఉండేది. మనం ఎన్ని ప్రాజెక్ట్‌లు చేశాం, ఎన్ని బ్రాండ్స్‌కు ప్రకటనకర్తగా ఉన్నామనే దానిపైనే విజయాన్ని నిర్ణయించేవారు. ఆ సమయంలో ఎన్నో మల్టీనేషనల్ బ్రాండ్స్‌కు నేను బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించా. అది నాకెంతో ఆనందాన్ని ఇచ్చింది. కానీ, ఇప్పుడు ఎన్నో విషయాలు నేర్చుకున్నా. ఉత్పత్తులను ప్రమోట్ చేసేటప్పుడు ఎంతో బాధ్యతగా వ్యవహరించాలని తెలుసుకున్నా. ఒకప్పుడు ఇష్టం వచ్చిన బ్రాండ్స్‌కు అంబాసిడర్‌గా ఉన్నందుకు నాకు నేనే క్షమాపణ చెబుతున్నా. కోట్లలో డబ్బు ఇస్తానని వచ్చినప్పటికీ గడిచిన ఏడాదిలోనే సుమారు 15 బ్రాండ్స్ వదులుకున్నా. ఇప్పటికీ నా వద్దకు ఎన్నో ఉత్పత్తులకు సంబంధించిన వాణిజ్య ప్రకటనల ఆఫర్స్ వస్తుంటాయి. కాకపోతే వాటిని నేను వెంటనే అంగీకరించను. ఆయా ఉత్పత్తులను మొదట నాకు తెలిసిన ముగ్గురు వైద్యులతో పరిశీలించి.. అవి సమాజానికి ఎలాంటి హాని చేయవని నిర్ణయించుకున్నాకే వాటిని చేస్తున్నా" అని సమంత వివరించారు.తాను మయోసైటిస్‌తో ఇబ్బందిపడుతున్నానని గత కొంతకాలం క్రితం సమంత తెలియజేశారు. చికిత్స తీసుకుంటూనే తాను సినిమా షూటింగ్స్‌లో పాల్గొన్న రోజులు ఉన్నాయని చెప్పారు. 'సిటడెల్: హనీ బన్నీ' తర్వాత ఆమె యాక్ట్ చేస్తోన్న తాజా ప్రాజెక్ట్ 'రక్త్ బ్రహ్మాండ్'. రాహి అనిల్ బార్వే దర్శకుడు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఇది రూపొందనుంది. 'మా ఇంటి బంగారం' అనే సినిమా చేస్తున్నట్లు ఆమె ప్రకటించారు. ఆమె నిర్మాతగా వ్యవహరించిన 'శుభం' చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది.